క్లుప్తంగా

జాతీయ జెండాలతో ప్రదర్శన



పాశర్లపూడిలంకలో జాతీయ పతాకాలతో డ్వాక్రా మహిళల ప్రదర్శన

మామిడికుదురు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాశర్లపూడిలంకలో డ్వాక్రా మహిళలు ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు త్రివర్ణ పతాకాలతో వందేమాతరం... వందే మాతరం అంటూ ఎంతో ఉత్సాహంగా ప్రదర్శనలో పాల్గొన్నారు. ఎంతో మంది త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం లభించిందని గ్రామ సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ చెరుకూరి పార్వతి పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రధాని మోదీ పిలుపునివ్వడం హర్షణీయమన్నారు. ప్రదర్శనలో యానిమేటర్లు బావిశెట్టి నాగమణి, కె.అనూష, జి.నిరీష, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వెంకట్‌కు ఇండియన్ ఐకాన్ జాతీయ పురస్కారం



ఇండియన్ ఐకాన్ జాతీయ పురస్కారం అందుకుంటున్న వెంకట్

అంబాజీపేట: స్థానిక సామాజిక సహజకవి వెంకట్ పాలమూరికు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ ఐకాన్ జాతీయ పురస్కారం లభించింది. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న రాజమహేంద్రవరంలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియన్ ఐకాన్ జాతీయ పురస్కారాన్ని మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర చేతుల మీదుగా అందుకొన్నారు. వెంకట్ గత కొంత కాలంగా సమాజంలో జరుగుతున్న అనేక అంశాలపై తన కవిత, రచనలతో ఆలోచింపచేస్తూ, చైతన్య పరుస్తున్నారు. సామాజిక సహజకవిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న వెంకట్‌కి అవార్డు రావడంపై అభిమానులు, పుర ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏన్ పాల్‌కు ఇండియన్ ఐకాన్ అవార్డు

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లికి చెందిన బ్లెస్సి నిర్మల్ చారిటబుల్ ట్రస్ట్, పరలోక అగ్ని అపొస్తలిక్ మినిస్ట్రీ ఫౌండర్ చైర్మన్ పాస్టర్ ఏన్ పాల్‌కు ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఇండియన్ ఐకాన్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును రాజమహేంద్రవరంలోని ధర్మంచర కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మైనింగ్ మంత్రి కొల్లు రవీంద్రబాబు చేతుల మీదుగా అందుకున్నారు. తాను పేదలకు అందించిన సేవలకు గాను ఈ అవార్డును అందించినట్లు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణ మార్పులకు అనుగుణంగా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని స్వామి వివేకానంద యోగా ఆశ్రమం ఆయుర్వేద ఫిజియోథెరపీ వైద్యుడు, యోగా గురువు యోగా శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేటలో ఉచిత యోగా శిక్షణా తరగతులను ఆదివారం ప్రారంభించారు. యోగా శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్యం ఇంటి పనితో ఒత్తిడికి గురవుతున్న మహిళలకు రుగ్మతలు తొలగడంతో పాటు మానసిక ప్రశాంతత యోగా ప్రాణాయామాలు, ఆసనాలు, సూర్య నమస్కారాలతో లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఉచితంగా నిర్వహించే యోగా శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీబీ సకీనాకు నివాళి

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్ తనయురాలు బీబీ సకీనా షహదత్‌లో భాగంగా ముస్లింలు ఆదివారం ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. నగరం గ్రామంలోని బీబీ సకీనా పంజాలో గురుహే తాజ్‌దారే వఫా భక్త బృందం ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమం జరిగింది. మత ప్రబోధకుడు సయ్యద్ మహ్మద్ రజా రజ్వీ మజ్లిస్ ఆలపించారు. మామిడికుదురు షియా మసీదులో నవ యువకుల ఆధ్వర్యంలో మజ్లిస్ జరిగింది. సుదూర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు మొహరం సంతాప కార్యక్రమాల్లో భాగంగా ఇమామ్ హుస్సేన్, అతని పరివారానికి నివాళులర్పించారు. పలు భక్త బృందాలు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా గజ్జె పూజోత్సవం

కొత్తపేట: స్థానిక సత్యసాయి నిలయంలో శారదా కళాక్షేత్రం కూచిపూడి నృత్య శిక్షణ విద్యార్థులతో గజ్జె పూజోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కళాక్షేత్ర గురువు రావి బేబీసత్యవాణి ఆధ్వర్యంలో 30 మంది కూచిపూడి నృత్య శిక్షణ పొందుతున్న కళాకారులు నృత్యంతో విశేషంగా అలరించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖ వైద్యుడు మెంటే ఉదయభాస్కరరావు, డాక్టర్ శ్రీధర్‌నాయుడు, డాక్టర్ ప్రదీప్తి కరుణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బాలలకు శాస్త్రీయ నృత్యంలో శిక్షణ ఇప్పించి గొప్ప సంప్రదాయ కళాకారులుగా తీర్చిదిదాలని అన్నారు. తద్వారా వారిలో కళా నైపుణ్యాన్ని వెలికితీయాలన్నారు. శాస్త్రీయ నృత్యంలో ఆరితేరి బాలలను తీర్చిదిద్దుతున్న బేబీసత్యవాణిని అభినందించారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు.

కాజ్‌వేను పునర్నిర్మించరా?

- నిధులు మంజూరైనా మొదలు కాని పనులు
- వరదొస్తే చాలు పలు గ్రామాలకు ఇబ్బందులు
- త్వరగా ఆధునీకరించాలని ప్రజల డిమాండ్



శిథిలస్థితికి చేరిన అప్పనపల్లి కాజ్‌వే

మామిడికుదురు: దశాబ్దాల క్రితం నిర్మించిన అప్పనపల్లి కాజ్‌వే పూర్తిగా శిథిలమైంది. పాశర్లపూడి ఏటిగట్టు దిగువన ఉన్న ఈ కాజ్‌వే పరిస్థితి దారుణంగా మారింది. గోదావరి వరదల సమయంలో ఈ కాజ్‌వే వద్ద పరిస్థితి ప్రమాదకరంగా పరిణమిస్తోంది. ఈ కాజ్‌వేతో పాటు రోడ్డు ఆధునీకరణకు రూ.14.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు. కాజ్‌వే మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. కాజ్‌వే పనుల కోసం మెటీరియల్ సిద్ధం చేసినా పనులు ప్రారంభం కాలేదు. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాజ్‌వే పనుల కోసం కాజ్‌వేకు ఇరువైపులా ఉన్న రోడ్డు పనులను అసంపూర్తిగా వదిలివేశారు. కాజ్‌వేతో పాటు సిమెంట్ కాంక్రీట్ రోడ్డుతో సహా సుమారు 400 మీటర్ల రోడ్డు అభివృద్ధికి నోచుకోవాల్సి ఉంది. పూర్వం నిర్మించిన ఈ కాజ్‌వే పల్లంగా ఉండడంతో ధవళేశ్వరంలో గోదావరి వరద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి దాటిన వెంటనే ముంపుబారిన పడుతోంది. దీంతో ఈ మార్గంలో మూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు సంబంధాలు తెగిపోయి, పడవలపై రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. కాజ్‌వేను ఎత్తు పెంచి ఆధునీకరించేందుకు నిధులు మంజూరైనా పనులు మొదలు కాలేదు. దీనిపై అధికారులు దృష్టి సారించి దీని అభివృద్ధి పనుల సత్వరం పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ కె.సురేష్‌ను 'సాక్షి' వివరణ కోరగా నిధులు విడుదల కాగానే పనులు మొదలు పెడతామన్నారు.

కాజ్‌వేను ఆధునీకరించండి



గోదావరి వరదల సమయంలో అప్పనపల్లి కాజ్‌వే ముంపుబారిన పడడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. వరదనీటిలో ప్రమాదకర పరిస్థితుల మధ్య రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇటీవల వచ్చిన గోదావరి వరదకు సుమారు 12 రోజులు కాజ్‌వే నీట మునిగే ఉంది. ఈ మార్గంలో రాకపోకలు నిలిపి వేయడంతో ఎన్నో అవస్థలు పడ్డాం. దీనిని ఆధునీకరించాలని కోరుతున్నాం. శిథిలస్థితికి చేరిన కాజ్‌వేను పునర్నిర్మించి లంక గ్రామాల ప్రజలకు మేలు చేయాలి.

– పినిశెట్టి వెంకటరామారావు, బి.దొడ్డవరం

మా అవస్థలు ఎవరికీ పట్టడం లేదు



దశాబ్దాల క్రితం నిర్మించిన అప్పనపల్లి కాజ్‌వే పూర్తిగా పాడైపోయింది. ఇది పాశర్లపూడి వైపు దిగబడి పోయింది. మధ్యలో కొన్ని చోట్ల దిగబడిపోవడంతో ఇక్కడ పరిస్థితి ప్రమాదకరంగా మారింది. ఎంతో కాలం నుంచి ఈ కాజ్‌వేను ఆధునీకరించాలని కోరుతున్నా మా అవస్థలు ఎవరికీ పట్టడం లేదు. దీనిపై కూటమి ప్రభుత్వం తక్షణం స్పందించాలి. పాడైపోయిన కాజ్‌వేను అభివృద్ధి చేయడంతో పాటు దాని ఎత్తును పెంచాల్సిన ఆవశ్యకత ఉంది. ఆ దిశగా అధికారులు స్పందించాలి.

– నక్కా గణేష్‌కుమార్, అప్పనపల్లి

ఫ్లైఓవర్ తరహాలో అభివృద్ధి చేయాలి



అప్పనపల్లి కాజ్‌వేను ఫ్లై ఓవర్ తరహాలో అధునాతనంగా నిర్మించాలి. ఒక మాదిరి వరదకు కాజ్‌వేను వరద నీరు ముంచెత్తుతోంది. దీంతో వరదల సమయంలో అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి నుంచి ప్రజలకు మోక్షం కలిగించాలి. ధవళేశ్వరంలో మూడో ప్రమాద హెచ్చరిక స్థాయి వరకు కాజ్‌వే ముంపునకు గురి కాకుండా కాజ్‌వేను ఆధునీకరించాలి. ఆ దిశగా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు కార్యాచరణ చేపట్టాలి.

– కొమ్ముల సూరిబాబు, పెదపట్నంలంక

నేటి నుంచి శిక్షణా తరగతులు

మామిడికుదురు: మండలంలోని 18 గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు జరుగుతాయని ఎంపీడీఓ ఎస్.వేణుగోపాలరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు విధిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

18న జాతీయ శతాధిక కవి సమ్మేళనం

సఖినేటిపల్లి: ఈ నెల 18వ తేదీన అమలాపురంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో 138వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర పర్యాటక, టూరిజం, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా జాతీయ శతాధిక కవి సమ్మేళనం, తెలుగు భాషా సంబరాలపై బ్రోచర్ ఆవిష్కరించారు. ప్రతాప్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ సంబరాల్లో భాగంగా పై కవి సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. తెలుగు భాష, తెలుగు సంస్కృతి, తెలుగు వైభవంలపై ఈ కవి సమ్మేళనం ఉంటుందన్నారు.

గుర్తింపు కార్డులు రెన్యువల్ చేయించుకోవాలి



గంగలకుర్రులో రాష్ట్ర అధ్యక్షుడు రామును సన్మానిస్తున్న సంఘ కార్మికులు

అంబాజీపేట: భవన నిర్మాణ రంగ కార్మికులు తమ గుర్తింపు కార్డులను రెన్యువల్ చేయించుకోవాలని ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గల్లా రాము తెలిపారు. గంగలకుర్రులో రావులమ్మ తల్లి తాపీ పనివార్ల కార్మిక సంఘం ఆధ్వర్యంలో రామును ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్మిక సంఘ అధ్యక్షుడు బొరుసు కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాము మాట్లాడుతూ కొత్తగా చేరిన కార్మికులు నూతన కార్డులకు కొత్తపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులకు నిరంతరం వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నందుకు గాను రామును సన్మానించినట్లు సంఘ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు చిరతపూడి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కుడుపూడి రమేష్, సహాయ కార్యదర్శి జయను వెంకటరమణ, ఊటాల రమేష్, బొల్లంగి పల్లంశెట్టి, మట్టపర్తి రామకృష్ణ, పలివెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహునికి జన్మనక్షత్ర పూజలు



అంతర్వేది ఆలయంలో స్వాతి నక్షత్ర పూజలు చేస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహుని జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని ఆదివారం స్వామివారికి అర్చకులు అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు పి.రామశేషాచార్యులు ఈ పూజలు నిర్వహించారు. తొలుత వశిష్ఠ గోదావరి నది నుంచి కలశలతో తెచ్చిన పవిత్ర జలాలకు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం 108 కలశలలో ఉంచిన జలాలల్లోకి స్వామివారి మూల మంత్రంతో ఆవాహనం చేసి అర్చన చేశారు. అలాగే సర్వదేవతలను కలశల్లోకి ఆవాహనం చేసి విశేష పూజలు నిర్వహించారు. వీటితో పాటు పంచామృతాలతో, వేద మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి విశేష అభిషేకం, పూజలు చేశారు. అలాగే ఆలయంలో ఎంతో ప్రాశస్త్యం కలిగిన నారసింహ సుదర్శన హోమంలోను భక్తులు పాల్గొన్నారు. కాగా స్వామిని ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనాల ద్వారా 4 వేల మంది భక్తులు దర్శించుకున్నట్టు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ చెప్పారు. ఆలయంలో నిర్వహించిన విశేష కార్యక్రమాలన్నింటికీ విచ్చేసిన భక్తులకు అన్నదాన పథకంలో భోజన వసతి ఏర్పాటు చేశామని ఆయన అన్నారు.

లక్ష్మీనృసింహుని సన్నిధిలో ఎల్ఐసీ ప్రముఖులు



అంతర్వేది ఆలయంలో ఎల్ఐసీ ప్రముఖులకు స్వామి చిత్రపటం ఇస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం సౌత్ సెంట్రల్ జోనల్ మేనేజర్ (ఎల్ఐసీ)పునీత్ కుమార్, రీజినల్ మేనేజర్ ఉతుప్ జోసెఫ్, ఎస్‌డీఎం సంధ్యారాణి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకుడు పి.రామశేషాచార్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



అంతర్వేది ఆలయంలో స్వామి చిత్రపటం అందుకుంటున్న యమున

అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు మలికిపురం భూపతివారి పేటకు చెందిన గుబ్బల శేఖర్‌బాబు, యమున దంపతులు రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయంలో ఆలయ సిబ్బందికి పై మొత్తాన్ని ఇచ్చి, స్వామివారి చిత్ర పటం, ప్రసాదంను ఆమె అందుకున్నారు.

కేశవదాసు విగ్రహ ప్రతిష్ఠకు వినతి



విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యేను కలసిన యాదవ సంఘం ప్రతినిధులు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో లక్ష్మీనృసింహుని భక్తుడైన మందపాటి కేశవదాసు విగ్రహ ప్రతిష్ఠకు సహకరించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు, నియోజకవర్గ యాదవ సంఘం విజ్ఞప్తి చేసింది. ఆదివారం విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే ఇంటి వద్ద ఆయనను సంఘ అధ్యక్షుడు మందపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రతినిధులు కలిశారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన వరప్రసాద్‌కు బొకే ఇచ్చి వారు అభినందనలు చెప్పారు. లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో పూర్వం ధూప దీప నైవేద్యాలు సమర్పించిన స్వామి భక్తుడు కేశవదాసును రానున్న తరాల వారికి గుర్తు ఉండేలా పై చర్యలు చేపట్టాలని కోరారు. కాగా త్వరలో భర్తీ చేయనున్న నామినేటెడ్ పదవులలో యాదవులకు తగిన ప్రాధాన్యమివ్వాలని కోరారు. చదువుకున్న యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ప్రధాన కార్యదర్శి నూనె రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ, ప్రతినిధులు జి.సూరిబాబు, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.కొండలరావు, ఎస్.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీ విజేతలు వీరే...



టోర్నమెంట్ విజేతలతో క్లబ్ సభ్యులు

మలికిపురం: స్థానిక శ్రీరామ బ్యాడ్మింటన్ అకాడమీ సౌజన్యంతో ఫ్రెండ్స్ షటిల్ క్లబ్ ఆధ్వర్యంలో మలికిపురం డిగ్రీ కాలేజ్ ఇండోర్ స్టేడియంలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన షటిల్ టోర్నమెంట్ గత రెండు రోజులుగా జరుగుతున్నాయి. వివిధ టీంలు తలపడగా ఆదివారంతో పోటీలు ముగిశాయి. టోర్నమెంట్‌లో సీనియర్స్ విభాగంలో విన్నర్స్‌గా పెద్దిరాజు, అండ్ బాలు టీం రన్నర్స్‌గా పి.కృష్ణచైతన్య-బి.వీరబాబు టీంలు నిలిచాయి. జూనియర్స్ విభాగంలో విన్నర్స్‌గా ఎస్.విశాల్ రాజు-వై.నాగబాబు టీం, రన్నర్స్‌గా ఆర్.వేణు-బి.ప్రశాంత్‌లు గెలుపొందారు. ఈ టోర్నమెంట్‌కి చీఫ్ రిఫరీ మహ్మద్ జానీ ఇంతాల్, కోచ్ కె.హరికృష్ణ వ్యవహరించగా క్రీడాకారులను దెందుకూరి రాంబాబురాజు, ప్రముఖ షటిల్ క్రీడాకారుడు పెదపాటి జాన్ విలియమ్స్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్లబ్ సభ్యులు గెద్దాడ నాగేశ్వరరావు, కృష్ణ చైతన్యమణి, నేతికొండ అంజి, నల్లి శివకుమార్, పెదబాబు, సద్గుణ్ సాయిరాం, పవన్, చందు, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సలహాతో సమస్య నుంచి విముక్తి



రావులపాలెంలో న్యాయ సలహాలపై చర్చిస్తున్న ప్రసన్న తదితరులు

రావులపాలెం: సమస్యలతో సతమతమవుతున్న వారికి సకాలంలో న్యాయ సలహా అందడం ద్వారా సమస్య నుంచి విముక్తి లభించే అవకాశాలున్నాయని విమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ చైర్మన్, న్యాయవాది బూసి ప్రసన్న అన్నారు. విమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, అప్నా అంజుమన్ ఈఫలహే మిల్లత్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రావులపాలెం బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలోని మసీదు ఆవరణలో ఉచిత న్యాయ సలహాల కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాది ప్రసన్న మాట్లాడుతూ రోజువారీ జీవితంలో తలెత్తుతున్న పరిస్థితులను అర్థం చేసుకోవడంతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్ట పరిధిలో సమాచారాన్ని పొందే హక్కు అందరికీ ఉందన్నారు. సమస్యలకు గురైన పేదలకు తాము న్యాయపరంగా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ట్రస్ట్ కార్యదర్శి ముప్పిరి వెర్రియ్య, అప్నా అంజుమన్ ఇ ఫలహే మిల్లత్ కమిటీ అధ్యక్షుడు బాషా మాట్లాడుతూ సామాన్య ప్రజలకు అండగా నిలిచేందుకు తమ కార్యకలాపాలను విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు జహంగీర్, రహ్మతుల్లా, షరీఫ్ వలియుల్లాహ్ మాట్లాడారు.

ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందించాలి

అయినవిల్లి: జాతీయ జెండాను ఎగురవేసి ప్రతి ఒక్కరిలో జాతీయ భావాన్ని పెంపొందించాలని పి.గన్నవరం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు అన్నారు. అయినవిల్లి మండల కార్యవర్గ సమావేశం ఆదివారం అయినవిల్లి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అధ్యక్షుడు కుడుపూడి చంద్రశేఖర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఆగస్టు 15న బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించాలని, స్కూల్ విద్యార్థులతో త్రివర్ణ పతాకాలతో ప్రదర్శన, స్వాతంత్ర్యోద్యమ నాయకుల విగ్రహాలను శుభ్రం చేసి, పూలమాలలతో అలంకరించాలని, పరిసరాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించాలని వెంకటేశ్వరరావు అన్నారు. అనంతరం పి.గన్నవరం నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ కొల్లి సూర్యారావు అకాల మృతికి చింతిస్తూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



లూటుకుర్రులో సందడి చేసిన పూర్వ విద్యార్థులు



ముంగండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

మామిడికుదురు: లూటుకుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. 1982–85 వరకు పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు సమావేశమై నాటి మధుర స్మృతులను, చిలిపి సంఘటనలను గుర్తు చేసుకుని ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఘనంగా సత్కరించారు. వారికి పాదపూజ చేశారు. జ్ఞాపికలను బహూకరించారు. కష్టపడి, ఇష్టంతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయులు నూకల కామేశ్వరరావు, పెదపూడి శ్రీరామచంద్రాచార్యులు, అక్కిరెడ్డి సత్యనారాయణ, పోచిరాజు నాగేశ్వరరావు, నూకల సూర్యనారాయణమూర్తి, కర్రా సూర్యనారాయణ, నూకల సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. సమావేశంలో విళ్ల రాంబాబు, వంకాయల కృష్ణ, విళ్ల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

25 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలయిక

పి.గన్నవరం: ముంగండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 25 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం ఘనంగా జరిగింది. 1998–99 విద్యా సంవత్సరం టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఇక్కడ జరిగిన సమావేశానికి హాజరయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. గత జ్ఞాపకాలను నెమరు వేసుకుని సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘ నాయకులు ఆకుల నాగప్రసాద్, బొడ్డు రమాదేవి, విజయకుమార్, మాచగిరి ఏడుకొండలు, వాసు కవిత, కల్యాణి, విజయలక్ష్మి, రాధాకృష్ణ, సుబ్బరాజు, విత్తనాల మంగాలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవాలతో బాలల్లో ప్రతిభ బహిర్గతం

- చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించాలి
- కోనసీమ బాలోత్సవం ముగింపు సభలో వక్తలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, శిల్పి వుడయార్

కొత్తపేట: ప్రాథమిక స్థాయి నుంచీ బాలలతో బాలోత్సవాలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారిలో ఉన్న ప్రతిభను బహిర్గతం చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కోనసీమ బాలోత్సవం మొదటి పిల్లల పండగ పేరిట రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. మనం ట్రస్ట్, జితేంద్ర సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండోరోజు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పిల్లలు వీడియో గేమ్‌లు, సెల్‌ఫోన్లకు బానిసలవుతున్న తరుణంలో బాలోత్సవం పేరిట ఇటువంటి సాంస్కృతిక, అకడమిక్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బాలోత్సవం నిర్వాహకులు జితేంద్ర సేవా ఫౌండేషన్ చైర్మన్ మట్టపర్తి జితేంద్ర కుమార్, కోనసీమ బాలోత్సవ అధ్యక్షుడు కాశీ విశ్వనాథం, మనం ట్రస్ట్ ఇన్‌చార్జి యెండూరి పవన్, మనం ట్రస్ట్ చైర్మన్ కె.వీరబాబు అభినందించారు. అకడమిక్ విభాగంలో సుమారు 50 ఈవెంట్స్, సాంస్కృతిక విభాగంలో 16 పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే సత్యానందరావు, ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్‌వుడయార్ తదితరుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సర్పంచ్ బూసి జయలక్ష్మి, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, మండల వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సత్తిరాజు ఆదిత్యకిరణ్, ఎంఈఓ ఎం.హరిప్రసాద్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, రావులపాలెం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో ఎస్.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలి

మలికిపురం: ప్రభుత్వం త్వరలో నియమించబోయే నామినేటెడ్ పదవుల్లో యాదవులకు ప్రాధాన్యం ఇవ్వాలని రాజోలు నియోజకవర్గ యాదవ సామాజికవర్గం కోరింది. ఈ మేరకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే నివాసంలో ఈ మేరకు కలసి వినతిపత్రం అందించారు. అంతర్వేదిలో ఆయన అభివృద్ధికి కృషి చేసిన యాదవుడైన మందపాటి కేశవదాసు విగ్రహం ఏర్పాటు చేయాలని, నైపుణ్యం గల యాదవులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. సంఘ అధ్యక్షుడు మందపాటి సత్యనారాయణ, నూనె రామకృష్ణ, ఎం.రామకృష్ణ, గుండుమేను సూరిబాబు, మన్నె కొండలరావు, కృష్ణారావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం

మలికిపురం: త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో ఆదివారం మలికిపురం మండలంలోని రామరాజు లంకలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల ఇందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక- మామిడికుదురు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు బండారు సత్యనారాయణ, హనుమంతరావు, బ్రహ్మాజీ, శేషు, ధర్మతేజ, సత్యవతి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.